అడుగడుగునా సమస్యలే..

- వెలగని వీధి లైట్లు
- పూర్తిస్థాయిలో అందని తాగునీరు
- అధ్వానంగా పారిశుధ్య నిర్వహణ
- రోడ్డుపైనే మురుగు
- 8వ వార్డులో ప్రజల అవస్థలు



ఎండాడ రాజీవ్‌నగర్‌లో డ్రైనేజీ దుస్థితి



రుషికొండలో విద్యుత్ స్తంభం దుస్థితి



అంధకారంలో ఎస్సీ కాలనీ



ఎండాడ జీవీఎంసీ పార్కులో గేదెలు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులో ప్రజలను అడుగడుగునా సమస్యలు వెంటాడుతున్నాయి. మౌలిక సౌకర్యాల కల్పనలో ప్రభుత్వం పూర్తి స్థాయిలో విఫలమైందని ఆరోపణలు వినపడుతున్నాయి. వీధి లైట్ల నుండి తాగునీటి వరకు అన్నీ అసౌకర్యాలే అని పేర్కొంటున్నారు.

- ఎండాడ ఎస్సీ కాలనీ, రుషికొండ ప్రాంతాల్లో తాగునీరు లేక స్థానికులు అవస్థలు పడుతున్నారు.
- దశాబ్దాల క్రితం నిర్మించిన రోడ్లు, మురుగుకాలువలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. సాగర్‌నగర్‌లో డ్రైనేజీలు నెల రోజులుగా నిండిపోయి ఉన్నాయి. ఎండాడ రాజీవ్‌నగర్‌లో డ్రైనేజీలపై రెండు నెలలుగా మూతలు వేయకపోవడంతో దుర్వాసనతో సహవాసం చేస్తున్న పరిస్థితి. వర్షాలు పడే సమయంలో సమస్య మరింత తీవ్రమవుతోంది.
- ఎండాడ జీవీఎంసీ పార్కులో ఓ టీడీపీ నాయకుడు ఏకంగా గేదెలను కట్టివేయడంతో వాకర్లు, సీనియర్ సిటిజన్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు.
- శ్మశానవాటికలో కనీస సదుపాయాలు లేక దహన సంస్కార సమయంలో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- రుషికొండ, ఎండాడ, గుడ్లవానిపాలెం ప్రాంతాల్లో పలు చోట్ల సీసీ రోడ్లు లేకపోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- ప్రభుత్వం సంక్షేమ పథకాలంటూ ఊదరగొట్టి, ఏ ఒక్కటీ అమలు చేయడం లేదు. మా ప్రాంతంలో కనీసం మౌలిక సౌకర్యాలైనా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మూడు నెలలుగా అధికారులకు చెప్తున్నా..

ఎండాడ రాజీవ్‌నగర్‌లో కాలువలపై శ్లాబ్‌లు తీసివేయడంతో ద్విచక్ర వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. దీనిపై జోనల్ ఆఫీసు పీజీఆర్ఎస్‌లో అనేక సార్లు ఫిర్యాదు చేశాం. నెలలు గడుస్తున్నా అధికారుల్లో మాత్రం స్పందన లేదు.

– పాపారావు, రాజీవ్‌నగర్

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

ఎండాడ నుండి రుషికొండ వెళ్లే మార్గమధ్యలో విద్యుత్ స్తంభం అడుగుభాగం ధ్వంసమైంది. దీంతో ఏ సమయంలో అయినా ప్రమాదం జరగవచ్చు. దీనిని తొలగించమని ఆ శాఖకు సంబంధించిన అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు.

– బి.రాము రుషికొండ

మంచినీటి సమస్య వేధిస్తోంది

పెదరుషికొండ, చినరుషికొండ, స్వర్ణభారతి నగర్‌లో మంచినీటి సమస్య తీవ్రంగా ఉంది. జీవీఎంసీ కుళాయిలు ఒక రోజు వస్తే మూడు రోజులు రావడం లేదు. మంచినీటి సమస్య పరిష్కారం కోసం అధికారులను ఆశ్రయించినా ఫలితం శూన్యం. అధికారులు కనీస సౌకర్యాలు కల్పించడం లేదు.

– అప్పలరాజు, రుషికొండ

గృహనిర్మాణ లే అవుట్లు పరిశీలించిన కలెక్టర్

- గిడిజాల, కణమాం పంచాయతీల్లో పర్యటన
- త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశం



గిడిజాలలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

తగరపువలస: ఆనందపురం మండలం గిడిజాల, కణమాం పంచాయతీలలో నిర్మాణంలో ఉన్న ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గృహ నిర్మాణ లే అవుట్లను కలెక్టర్ ఎం.ఎన్.హరేందిరప్రసాద్ బుధవారం పరిశీలించారు. లే అవుట్లలో ఎన్ని ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి? ఇప్పటి వరకు ఎన్ని పూర్తయ్యాయి? వివిధ దశలలో ఎన్ని ఉన్నాయి వంటి విషయాలు అడిగి తెలుసుకున్నారు. లే అవుట్ విస్తీర్ణం, అప్రోచ్ రోడ్లు, మౌలిక సదుపాయాల గురించి ఆరా తీశారు. ఇళ్ల నమూనాలను పరిశీలించి లోపలికి వెళ్లారు. శ్లాబ్, కిటికీలు, కాంక్రీట్ పనులు క్షుణ్ణంగా పరిశీలించి, అక్కడి అధికారులకు సూచనలు చేశారు. అందరూ బాధ్యతాయుతంగా పనిచేస్తూ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట గృహ నిర్మాణశాఖ పీడీ ఆళ్ల శ్రీనివాస్, ఏడీసీ రమణమూర్తి ఇతర అధికారులు ఉన్నారు.

భూముల పరిశీలన

అనంతరం మండలంలోని వివిధ రెవెన్యూ గ్రామాల పరిధిలో ఫ్రీహోల్డ్ భూములను కలెక్టర్ పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారికి ఆ భూములు సంక్రమించిన విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. అధికారులు దగ్గర ఉండి కలెక్టర్‌కు వివరించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్ తదితరులున్నారు.

రాజేంద్ర ప్రసాద్ మాస్టారు సేవలు నిరుపమానం



రాజేంద్రప్రసాద్ వర్మను సత్కరిస్తున్న కళాసాహితి, ప్రెస్‌క్లబ్ సభ్యులు

భీమునిపట్నం: ఉపాధ్యాయుడిగా రాజేంద్రప్రసాద్‌వర్మ అందించిన సేవలు నిరుపమానమని రాష్ట్ర కవితా సదస్సు అధ్యక్షులు బులుసు వెంకటేశ్వర్లు అన్నారు. ఉపాధ్యాయునిగానే గాక రచయితగా చక్కని రచనలు చేసి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన రాజేంద్రప్రసాద్‌ను స్థానిక కళాసాహిత సంస్థ బుధవారం సత్కరించింది. కార్యక్రమానికి హాజరైన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మాస్టారు ఎక్కడ పని చేసినా పిల్లలతో పాటు వారి తల్లిదండ్రులకు ఆయనపై ప్రత్యేక అభిమానం, అనుబంధం ఏర్పడేదని అన్నారు. ఉపాధ్యాయుడిగా, రచయితగానే గాక సామాజిక సేవల్లోనూ పాల్గొనడం అభినందనీయమన్నారు. సన్మానగ్రహీత మాట్లాడుతూ ఉద్యోగ జీవితం సంతృప్తినిచ్చిందని, ఇకపై రచనలను కొనసాగిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కళాసాహితి, భీమిలి ప్రెస్ క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ శిక్షణ కేంద్రం సందర్శన



శిక్షణ కేంద్రంలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో జయప్రద

తగరపువలస: ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) శిక్షణ తరగతులను ఎంఈవో ఎ.జయప్రద బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో మాట్లాడుతూ అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని, పోటీ తత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ శిక్షణలో నేర్చుకున్న జ్ఞానం పదో తరగతి పరీక్షల వరకు దోహదపడుతుందన్నారు. ఇప్పటి నుంచే అన్ని సబ్జెక్టులపై మక్కువ పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపకుడు గంటాన మోహనరావు, ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు, ఉపాధ్యాయులు యాగాటి వెంకట రమణ, పువ్వుల శ్రీనివాసరావు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఈసీహెచ్‌ఎస్ పాలి క్లినిక్ ఏర్పాటుకు వినతి



ఈసీహెచ్‌ఎస్ రీజనల్ అధికారి వివేక్‌కు వినతి పత్రం అందిస్తున్న సంక్షేమ సంఘం ప్రతినిధులు

తగరపువలస: ఉత్తరాంధ్రకు చెందిన 4వేల మంది మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులకు భీమిలి, తగరపువలసలో వైద్యసేవలు అందించాలని శ్రీచైతన్య మాజీ సైనికుల సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నగరంలో ఉన్నతాధికారులకు బుధవారం మరోమారు వినతిపత్రం అందించారు. ఎక్స్ సర్వీస్‌మెన్ కంట్రిబ్యూటరీ హెల్త్ స్కీమ్(ఈసీహెచ్‌ఎస్) ద్వారా నగర శివారు మల్కాపురంలోని కల్యాణి ఆసుపత్రిలో అందే వైద్య సదుపాయాలకు వెళ్లలేనందున రీజినల్ కమాండ్ ఆఫీసర్ వివేక్ హొట్టికి ఈ వినతి పత్రం అందించినట్టు సంఘం అధ్యక్షుడు కొయ్య గురయ్యరెడ్డి తెలిపారు. దీనిపై స్పందించిన ఆయన ఇప్పటికే జిల్లా సైనిక్ బోర్డు ద్వారా వినతిపత్రం అందిందని, దీనిపై ఢిల్లీ నుంచి అధికారుల ఆమోదం కూడా వచ్చిందని తెలిపారన్నారు. వైద్య సేవలు ఎక్కడి నుంచి అందించాలో త్వరలో తెలుస్తాయని తెలియజేశారన్నారు. వినతి పత్రం అందించిన వారిలో జిల్లా సైనికబోర్డు అధికారి జి.సత్యానందం, సుభాష్ షేక్, కొయ్య అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

రాగి పంటలో జింక్, పొటాష్ లోపం



గొట్టిపల్లిలో రైతులకు చీడపీడలు, నివారణ గురించి వివరిస్తున్న కీటక శాస్త్రవేత్త డాక్టర్ విశాలాక్షి



పాట్నూరులో మాట్లాడుతున్న ఏడీ విజయ్ ప్రసాద్

తగరపువలస: రాగి పంట వేసిన రైతుల భూములను పరిశీలించినప్పుడు జింక్, పొటాష్ లోపం ఎక్కువగా ఉన్నందున మూడు సీజన్లకు ఒకసారి ఆ ఎరువులను ఎకరానికి 20 కిలోల వంతున వేసుకోవాలని భీమిలి ఏవో బి.శివకోమలి తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం పెదనాగమయ్యపాలెం, చిప్పాడ పంచాయతీలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు పలు సూచనలు చేశారు. భూసార పరీక్షల ఆధారంగా వినియోగించవలసిన ఎరువుల గురించి వివరించారు. భూసార పరీక్షా ఫలితాల కార్డులను రైతులకు అందించారు. రానున్న రబీలో రాగి, నువ్వుల విత్తనాలు కావలసిన రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 10లోగా కొత్త బోట్ల రిజిస్ట్రేషన్ చేయించుకుంటే వేట నిషేధ కాలంలో భృతికి అర్హులవుతారన్నారు. కార్యక్రమంలో తాళ్లవలస పశువైద్యాధికారి ప్రశాంతి, చుక్క శివాజీ, సరగడ ఈశ్వరరావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

- ఆనందపురం మండలం గొట్టిపల్లి, కుసులవాడ పంచాయతీలలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో కీటక శాస్త్రవేత్త డాక్టర్ విశాలాక్షి సస్యరక్షణ, చీడపీడల నివారణ గురించి తెలియజేశారు. డీఆర్సీ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు చదువుల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సమగ్ర పోషక యాజమాన్యంలో భాగంగా రిలో ఏ మోతాదులో ఎరువులు వేసుకోవాలో తెలియచేశారు. ఆనందపురం ఏవో చావా సంధ్యరత్నప్రభ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసే పంటల గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మహంతి వెంకటలక్ష్మి, వ్యవసాయ సహాయకురాలు జి.రాజేశ్వరి పాల్గొన్నారు.

పంట మార్పిడి పద్ధతులు అవలంబించాలి

పద్మనాభం: పంట మార్పిడి పద్ధతులు అవలంబించాలని భీమునిపట్నం సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.విజయ్ ప్రసాద్ రైతులకు సూచించారు. మండలంలోని పాట్నూరులో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రబీలో రైతులు ఎక్కువగా మొక్కజొన్న సాగు చేస్తున్నారని, దీనికి ప్రత్యామ్నాయంగా రాగి (చోడి) పంట వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో ఎంపీఎస్ చలం, పశు వైద్యాధికారి లక్ష్మణరావు, మార్కెటింగ్ శాఖ అధికారి మేరి కుమారి పాల్గొన్నారు.

ముగ్గురు వ్యక్తులకు రిమాండ్

తగరపువలస: ఈ నెల 2, 3 తేదీలలో భీమిలి శివారు జొన్నాడ టోల్‌ప్లాజా వద్ద జరిగిన వివాదానికి సంబంధించి భీమిలి పోలీసులు బుధవారం ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వీరిలో భీమిలి మండలం బోడమెట్టపాలేనికి చెందిన లొడగల ఎర్రినాయుడు, లొడగల సురేష్, లొడగల ఈశ్వరరావు ఉన్నారు.

కార్మికనాయకుడు అప్పలస్వామి మృతి



అప్పలస్వామి (ఫైల్)

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు కాంగ్రెస్ కార్మిక సంఘం ఉపాధ్యక్షునిగా, మగ్గాలు డిపార్ట్‌మెంట్ కార్మికునిగా పని చేసిన సీనియర్ నాయకుడు యర్రా అప్పలస్వామి బుధవారం చిట్టివలసలో మృతి చెందారు. ఆయనకు కాంగ్రెస్ కార్మిక సంఘం నాయకులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

వీణా పుస్తకధారిణి.. విద్యాప్రదాయిని

విద్యాప్రదాయిని సరస్వతీ దేవి. సకల కళలకు అధిదేవత అయిన అమ్మవారిని నియోజకవర్గ వాసులు భక్తిశ్రద్ధలతో కొలిచారు. శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా దుర్గామాతను వీణా పుస్తకధారిణిగా అలంకరించి, విద్యార్థులు ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు.

- సరస్వతీదేవిగా దుర్గామాత
- చిన్నారులకు అక్షరాభ్యాసాలు
- చదువుల తల్లికి విద్యార్థుల పూజలు



సరస్వతీదేవిగా సుత్తమ్మతల్లి



దుర్గాలమ్మ ఆలయంలో వీణాపాణిగా..



ఆదర్శనగర్ మండపంలో సరస్వతీ పూజలు



బబ్బేలమ్మ ఆలయంలో కుంకుమార్చనలు



కొండపేట దుర్గాంబికాలయంలో దీపారాధన



శ్రీవిద్యా పీఠంలో చండీహోమం



ఆదిత్య ఫార్చ్యూన్‌లో ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు



కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అక్షరాభ్యాసాలు



సరస్వతీ దేవిగా పద్మావతి అమ్మవారు



మజ్జివలస మండపం వద్ద దీపాలంకరణ

తగరపువలస: శరన్నవరాత్రి మహోత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తున్నారు. సప్తమి తిథి, సరస్వతీ అమ్మవారి జన్మ నక్షత్రమైన మూలా నక్షత్రం సందర్భంగా అంతటా ప్రత్యేక పూజలు చేశారు. చదువులమ్మకు నీరాజనాలు సమర్పించారు.

- భీమిలి మండలం తాటితూరులో శ్రీశాలివాహన యువజన సేవాసంఘం ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలలో సరస్వతీదేవికి ప్రత్యేక అలంకరణ, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు తాటిపూడి రమణ, వైస్ ప్రెసిడెంట్ కొండలరావు, కార్యదర్శి రామకృష్ణ, శాలివాహన యూత్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.
- చిప్పాడ పంచాయతీలో గ్రామదేవత సుత్తమ్మ తల్లిని సరస్వతీ దేవిగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. రేఖవానిపాలెం పంచాయతీ కీతిన్‌పేటలోని శ్రీవిద్యాపీఠంలో సోమయాజుల కల్యాణ చక్రవర్తి అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.
- జీవీఎంసీ రెండోవార్డు ఆదర్శనగర్‌లో అర్చకుడు పెంట వెంకటరమణ శర్మ మండపంలో చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసాలు, సరస్వతీ పూజలు చేయించారు.

శ్రీమహాలక్ష్మిగా బబ్బేలమ్మ

పీఎం పాలెం: కారుషెడ్ దరి ఆలయంలో బబ్బేలమ్మ అమ్మవారు సరస్వతీ దేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ మండపంలో ఉదయం 6 గంటలకు వందలాది మంది విద్యార్థులతో సరస్వతీ పూజలు చేయించారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు.

సరస్వతీదేవిగా పద్మావతి అమ్మవారు

భీమునిపట్నం: కృష్ణాకాలనీ కొండపైనున్న కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద పద్మావతి అమ్మవారు బుధవారం సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు పెద్ద సంఖ్యలో సహస్ర కుంకుమార్చనలో పాల్గొన్నారు. పలువురు చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించారు.

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయం, మధురవాడ టైలర్స్ కాలనీ విజయ దుర్గా ఆలయం, సిద్ధేశ్వర స్వామి పీఠంలో, మిథిలాపురి వుడా కాలనీ ఆదిత్య ఫార్చ్యూన్ గేటెడ్ కమ్యూనిటీ ప్రాంతాల్లో అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. అమ్మ సన్నిధిలో తల్లిదండ్రులు చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించారు. ఆదిత్య ఫార్చ్యూన్‌లో ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు ఆకట్టుకున్నాయి.

దుర్గమ్మ సన్నిధిలో అన్న సమారాధన



చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయం వద్ద అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

తగరపువలస: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుదవారం భీమిలి అర్బన్, రూరల్ ప్రాంతాలలో పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. భీమిలి మండలం పాత మూలకుద్దు, టి.నగరపాలెం పంచాయతీ కొత్తూరులో భారీ అన్నదానం నిర్వహించారు. జీవీఎంసీ ఒకటోవార్డు పరిధిలో చిట్టివలస రెడ్డివీధి, జ్యూట్‌మిల్లు రామాలయం, రాములమ్మ థియేటర్ వద్ద మండపాలలోనూ అన్నప్రసాదాల పంపిణీ జరిగింది. కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

దుర్గాలమ్మ ఆలయంలో..

మధురవాడ: చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయంలో డాక్టర్ శ్రీప్రకాష్ లాలం, డాక్టర్ దేవణిల కుమారుడు అద్వైత్ శ్రీరామ్ సహాయ సహకారాలతో సుమారు 5వేల మందికి భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పిళ్లా సూరిబాబు, నాగోతి తాతారావు, గ్రామ పెద్దలు భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు.

కోలాట పోటీలకు రాజకీయ రంగు



ఆనందపురం ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన తెలియచేస్తున్న గొట్టిపల్లి కళాకారులు

తగరపువలస: ఆనందపురం మండలం ఎంపీడీవో కార్యాలయం వేదికగా గంటా నారాయణమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన కోలాటం పోటీలు రాజకీయరంగు పులుముకున్నాయి. దసరా సందర్భంగా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆయన మాతృమూర్తి పేరుతో నిర్వహించిన ఈ పోటీలు వివాదస్పదమయ్యాయి. తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్, ఎంపీడీవో జానకి న్యాయనిర్ణేతలుగా జరిగిన ఈ పోటీల్లో మండలానికి చెందిన సీనియర్, జూనియర్ కోలాట బృందాలు పాల్గొన్నాయి. ఫైనల్స్‌లో మొదటి బహుమతిగా రూ.50,116, రెండో బహుమతిగా రూ.25,116, మూడో బహుమతిగా రూ.15,116గా నిర్వాహకులు ప్రకటించారు. ఈ పోటీల అనంతరం న్యాయనిర్ణేతలు ముందుగా ఆనందపురం మండలం గొట్టిపల్లి పంచాయతీకి చెందిన బంగారమ్మ తల్లి కోలాటం గ్రూప్‌నకు మొదటి బహుమతి ప్రకటించారు. ఆ సమయంలో రంగప్రవేశం చేసిన టీడీపీ నాయకులు వీరంతా వైఎస్సార్‌సీపీకి చెందిన వారని తప్పించి, చందక పంచాయతీ గ్రూప్‌నకు మొదటి బహుమతి ప్రకటించారు. దీంతో గొట్టిపల్లి కోలాటం గ్రూప్ మహిళలు ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. గ్రామీణ కళలకు రాజకీయాలు ముడిపెట్టి తమను అవమానించారని వాపోయారు. ఎమ్మెల్యే మెప్పుకోసం అధికారులు వ్యవహరించిన తీరు ఎబ్బెట్టుగా ఉందన్నారు. వీళ్ల నిరసన వ్యక్తం చేయడంతో అధికారులు కార్యాలయానికి తాళాలు వేసుకుని మెల్లగా జారుకున్నారు.

పద్మనాభంలో ..

పద్మనాభం: గంటా నారాయణమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మండల స్థాయి కోలాటంలో సీనియర్ విభాగంలో కోరాడ పంచాయతీ గెద్దపేట గ్రామానికి చెందిన శ్రీరామ మహిళా కోలాట బృందం ప్రథమ స్థానాన్ని గెలుచుకుంది. జూనియర్ విభాగంలో పాండ్రంగి గ్రామానికి చెందిన జట్లమ్మ తల్లి కోలాటం బృందం మొదటి స్థానం కైవసం చేసుకుంది. సీనియర్ విభాగంలో ఏడు బృందాలు, జూనియర్ విభాగంలో ఆరు బృందాలు ఈ పోటీల్లో పాల్గొన్నాయి.

గెడ్డలు పరిశీలించిన జెడ్సీ

మధురవాడ: జోన్–2లో బక్కన్నపాలెం రోడ్డును ఆనుకుని ఉన్న గెడ్డను, ఇతర ప్రాంతాల్లో పాడైన రోడ్లు, కాల్వలను జెడ్సీ సింహాచలం బుధవారం పరిశీలించారు. పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శ్రీచైతన్య స్కూలు సమీపంలో భారీ గెడ్డను పరిశీలించి రిటైనింగ్ వాల్ నిర్మాణం, మరమ్మతులకు ఎస్టిమేషన్ తయారు చేయాలని ఏఈ శ్రీనివాస్‌ను ఆదేశించారు.

క్లుప్తంగా

పైడితల్లమ్మకు పసుపు కుంకుమ సమర్పణ



అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పిస్తున్న మహిళలు

పద్మనాభం: మండలంలోని మద్దిలో పైడితల్లమ్మకు మంగళవారం రాత్రి మహిళలు పసుపు, కుంకుమలు సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయానికి పోటెత్తారు. ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించనున్న బంగారమ్మ ఉత్సవాల్లో భాగంగా మహిళలు పైడి తల్లమ్మకు పసుపు, కుంకుమలు చెల్లించారు.

ఎస్‌జీఎఫ్ పోటీల్లో మధురవాడ క్రీడాకారుల ప్రతిభ



సర్టిఫికెట్లతో క్రీడాకారులు

మధురవాడ: ఎస్‌జీఎఫ్ పోటీల్లో మధురవాడకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. అక్టోబర్ 4 నుంచి 8వ తేదీ వరకు రైల్వే కోడూరు, తిరుపతిలో జరిగిన తైక్వాండో పోటీల్లో అండర్–17 విభాగంలో మణికంఠ హిమాన్స్ బంగారు పతకం, ఉదయ్ నిఖిల్, ఆదిత్య ధనలక్ష్మి రజత పతకాలు, అండర్–14 విభాగంలో శ్రీకర్ లోహిత్ రజతం, గాయత్రి కాంస్య పతకాలు అండర్–19 విభాగంలో గొలగాని తేజశ్రీ, ఎస్.రూపావతిలు రజత పతకాలు సాధించారు. విజేతలను, కోచ్‌ను తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులు అభినందించారు.

విద్యార్థులకు పట్టుదల, సమయపాలన అవసరం

తగరపువలస: విద్యార్థుల కలలు సాకారం కావాలంటే పట్టుదల, సమయపాలన అవసరమని జిల్లా ఆడిట్ రిజిస్ట్రార్ కె.మన్మధరావు అన్నారు. ఆనందపురం గాయత్రీ డిగ్రీ కళాశాల ఫెస్ట్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఆత్మ విశ్వాసంతో అనుకున్న పనులను సాధించవచ్చన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు లఘు నాటికలు, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రామకృష్ణ, చైర్మన్ వెంకటరావు, ప్రిన్సిపాల్ అప్పలరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు



విజయదుర్గ ఆలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు

మధురవాడ: తెలంగాణ సంప్రదాయ బతుకమ్మ సంబరాలకు మధురవాడ వేదికైంది. దసరా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మధురవాడ టైలర్స్ కాలనీలోని విజయదుర్గ ఆలయం వద్ద పరిసర ప్రాంతాలకు చెందిన వారు బుధవారం సాయంత్రం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. బోనాలను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు నృత్యాలతో సందడి చేశారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త బంగారు సుబ్బారావు, లక్ష్మి, ఝాన్సీ తదితరులు పర్యవేక్షించారు.

నేడు పద్మనాభం మండల సర్వసభ్య సమావేశం

పద్మనాభం: పద్మనాభం మండల సర్వ సభ్య సమావేశం గురువారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానున్న ఈ సమావేశానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.